క్లుప్తంగా

మంచినీటి పైపులైన్‌కు మరమ్మతు



తెనాలిఅర్బన్: స్థానిక అయితా నగర్‌లో పాడైన మంచినీటి పైప్ లైన్‌కు శనివారం మున్సిపల్ అధికారులు మరమ్మతు చేశారు. భూగర్భంలో ఉన్న పైప్‌లైన్‌ను బయటకు తీసి దానికి మరమ్మతు చేశారు. పనులకు కమిషనర్ బండి శేషన్న, ఇన్‌చార్జి ఎంఈ ఆకుల శ్రీనివాసరావులు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆదివారం పట్టణంలో రక్షిత మంచినీటిని యధావిధిగా సరఫరా చేస్తామని తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో లక్ష్మణరావుని గెలిపించండి



కొల్లిపర: మేధావి ప్రశ్నించే గొంతుగా ఉండే ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణ రావుని మేధావుల సభకు పంపించేందుకు ఒకటి ప్రాధాన్యత ఓటు వేసి రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబి రెడ్డి కోరారు. సీఐటీయూ మండల కార్యదర్శి కోటా చంద్రశేఖర రావుతో కలసి శనివారం మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో లక్ష్మణ రావును గెలిపించాలని అంటూ ప్రజా సంఘాల కార్యకర్తలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులం, డబ్బు రాజకీయాలకు అతీతంగా ప్రజల కోసం పనిచేసే నిస్వార్ధపరుడైన, నిజాయితీపరుడైన లక్ష్మణరావుని గెలిపించేందుకు అందరూ కృషి చేయాలన్నారు. కొన్నేళ్లుగా జిల్లాలో కౌలు రైతులకు, నిరుద్యోగులు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల మీద అడుగడుగునా అందరి వెంట ఉండి ఆయా సమస్యలపై పోరాడుతున్న వ్యక్తి లక్ష్మణరావు అని కొనియాడారు. అలాంటి వ్యక్తిని ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

టెక్నాలజీని అందిపుచ్చుకోండి



తెనాలిఅర్బన్: టెక్నాలజీలో వస్తున్న మార్పులకు విద్యార్థులు అందిపుచ్చుకోవాలని సిద్ధార్థ స్కూల్ ప్రిన్సిపల్ రోషన్, వైష్ణవీ కళాశాల ప్రిన్సిపల్ పాటిబండ్ల శ్రీనివాసరావులు పేర్కొన్నారు. వైష్ణవీ జూనియర్ కళాశాల ఇంటర్ రెండోవ సంవత్సర విద్యార్థుల వీడ్కోలు సభను కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ నేటి యువత సెల్‌ఫోన్‌లకు బానిసలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీని వల్ల అనేక ఆరోగ్య సమస్యలు రావటంతో పాటు పెడదారి పట్టే అవకాశం ఉందన్నారు. సెల్‌ఫోన్‌ను అవసరమైన మేరకు మాత్రమే ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం మొదటి సంవత్సర పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు మెమోంటోలు అందజేసి అభినందించారు. అలాగే విద్యార్థులు చేసిన నృత్యాలు పలువురిని అకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రశాంతి స్కూల్ ప్రిన్సిపల్ రామచంద్రరావు, పలువురు అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరంభమైన జ్ఞానమందిరం బ్రహ్మోత్సవాలు



తెనాలిటౌన్: రూరల్ మండల గ్రామం కొలకలూరులో వేంచేసియున్న శ్రీరామసాయి జ్ఞానమందిరం 17వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. అయిదురోజులు జరిగే ఈ వేడుకల్లో భాగంగా తొలిరోజున ఉదయం సాయిబాబాకు గ్రామోత్సవం జరిపారు. తదుపరి గణపతి పూజ, నవగ్రహ మండపారాధన, కలశస్థాపన, అఖండ జ్యోతి దీపారాధన వంటి పూజాదికాలను నిర్వహించారు. అనంతరం మాలేపాటి దుర్గాప్రసాద్-శ్రీహర్ష దంపతులు హోమ క్రతువులో పాల్గొన్నారు. విజయవాడకు చెందిన శివ జ్ఞానపీఠం అర్చకుడు హోమ క్రతువును శాస్త్రోక్తంగా జరిపించారు. బాబా సన్నిధిలో శ్రీ నాగదుర్గా భక్తబృందం, కొలకలూరు వారి కోలాట ప్రదర్శన భక్తులకు ఆకట్టుకుంది. అనంతరం తీర్ధ ప్రసాదాలను అందజేశారు. శ్రీరామసాయి ట్రస్ట్-శ్రీరామసాయి జ్ఞానమందిరం చైర్మన్ సంకా సతీష్, వైస్‌చైర్మన్ మాలేపాటి శ్రీనివాస్, సభ్యులు అకరంశెట్టి నాగేశ్వరరావు, ఎం.రోశిరెడ్డి, తోట నాగేశ్వరరావు, పలువురు భక్తులు పాల్గొన్నారు.









ఫుట్‌పాత్‌పై గుంత - బ్రిడ్జీపై తీరని చింత!

గుంటూరు వయా నారాకోడూరు రోడ్డులో పట్టణ చెంచుపేటను కలిపే రైల్ ఓవర్ బ్రిడ్జిపై ఫుట్‌ఫాత్‌లు ప్రాణాంతకంగా తయారయ్యాయి. బ్రిడ్జికి ఇరువైపులా గల ఫుట్‌పాత్‌లు అక్కడక్కడా కొంతభాగం దెబ్బతినటంతో గతంలో మరమ్మతులు చేశారు. పేవర్స్‌తో పటిష్టంగా చేశారు. మిగిలిన ప్రాంతంలో ఫుట్‌పాత్‌లు దారుణంగా దెబ్బతిన్నాయి. నడిచేందుకు అసలు ఆస్కారం లేకుండా పలుచోట్ల ధ్వంసమైంది. కొన్ని గుంతలు కూడా ఏర్పడ్డాయి. పగటిపూటే వాటిపై నడిచేందుకు అవకాశం లేదు. కాలు ఏమాత్రం పక్కకు పడినా విరిగిపోయే అవకాశం లేకపోలేదు. రాత్రివేళ మరింత ప్రమాదకరం. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే ఓవర్ బ్రిడ్జిపై పాదచారులకు అటూ ఇటూ రాకపోకలకు చేసేందుకు కేవలం ఫుట్‌పాత్‌లే మార్గం. అవే ధ్వంసమైతే ఇక నడిచేదెలాగని స్థానికుల ప్రశ్న. కేంద్ర సహాయ మంత్రికి, మరో రాష్ట్ర మంత్రికి స్వస్థలమైన తెనాలిలో ఇంతటి కీలక సమస్యపై సంబంధిత అధికారులు ఎందుకు దృష్టి సారించరో అర్థం కావటం లేదంటున్నారు.

– తెనాలి

స్వచ్ఛ గ్రామాల బాధ్యత ప్రజలందరిదీ

స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛతా దివస్‌లో ఎంపీడీవో దీప్తి

తెనాలిటౌన్: స్వచ్ఛ గ్రామాల బాధ్యత అందరిపై ఉందని ఎంపీడీవో అత్తోట దీప్తి అన్నారు. రూరల్ మండల గ్రామం నంది వెలుగులో శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛతా దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతినెలా మూడో శనివారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. పంచాయతీ కార్యాలయం నుంచి చెత్త సంపద కేంద్రం వరకు విద్యార్థులు, ఉద్యోగులకు స్వచ్ఛ ఆంధ్రపై ప్రచార ర్యాలీ చేశారు. ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీవో అత్తోట దీప్తి మాట్లాడుతూ, ఇంటి పరిసరాల శుభ్రతతోపాటు గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవటంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని సూచించారు. ప్రధానంగా ఇంటి నుంచి తడిచెత్త, పొడిచెత్త, హానికరమైన చెత్తను ఎలా వేరుచేయాలో సిబ్బంది గృహిణులకు అవగాహన కల్పిస్తున్నారు. ఆ విధానాన్ని ప్రతి ఇంటిలోనూ పాటించాలని కోరారు. తదుపరి ఆధునీకరించిన చెత్త సంపద కేంద్రాన్ని ఎంపీడీవో ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ ధూళిపాళ్ల పవన్ కుమార్, ఈవోపీఆర్డీ వైవీడీ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి హేమ, బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



నందివెలుగులో నిర్వహించిన ర్యాలీలో ఎంపీడీవో అత్తోట దీప్తి



ఆధునీకరించిన చెత్త సంపద కేంద్రాన్ని ప్రారంభించిన ఎంపీడీవో దీప్తి

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి

రేపల్లె డీఎస్పీ శ్రీనివాసరావు

రేపల్లె రూరల్: ప్రతి ఒక్కరూ అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని, తమ పరిసరాలలో అనుమానాస్పద స్థితిలో సంచరించే వారి వివరాలను పోలీసు స్టేషన్‌లో తెలియజేయాలని రేపల్లె డీఎస్పీ అవుల శ్రీనివాసరావు అన్నారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు రాత్రి పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా రేపల్లె పట్టణంలోని ప్రకాశం మున్సిపల్ స్కూలు ఆవరణలో శుక్రవారం పట్టణ ప్రజలతో మాట్లాడారు. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం పెరిగిందని, అదే విధంగా సైబర్‌నేరాలు పెరిగాయని హెచ్చరించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అవసరం మేరకు మాత్రమే వినియోగించాలని, అవసరం లేని విషయాలలో ఈ పరిజ్ఞానాన్ని వినియోగిస్తే మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ మల్లికార్జునరావు పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు తప్పనిసరి

చెరుకుపల్లి: రైతులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందాలంటే ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలని ఎంపీడీఓ షేక్ మహబూబ్ సుభానీ తెలిపారు. వ్యవసాయ శాఖ, పంచాయతీ రాజ్, మండల పరిషత్‌శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు విశిష్ట సంఖ్య నమోదు (ఫార్మర్ రిజిస్ట్రీ) ప్రచారాన్ని మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునికీకరణ చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం రైతులకు 14 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యను అందిస్తుందన్నారు. సొంత భూమి కలిగిన ప్రతి రైతు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివిధ పథకాలు, రాయితీలు పొందాలంటే 14 అంకెల విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని చెప్పారు. ఈ నెల 25వ తేదీలోగా నమోదు చేయించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అవ్వారు మహేష్‌బాబు పాల్గొన్నారు.



ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

పౌష్టికాహార లోపాల నివారణపై దృష్టి సారించాలి



కొల్లూరులో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్న ఏసీడీపీఓ

కొల్లూరు: గర్భిణులు, బాలింతలలో పౌష్టికాహార లోపాలను నివారించడంపై అంగన్‌వాడీ కార్యకర్తలు దృష్టి సారించాలని అమృతలూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఏసీడీపీఓ బి.విజయరాణి కోరారు. పోషన్ భీ-పడాయి భీ శిక్షణ కార్యక్రమంలో భాగంగా మూడో రోజు కొల్లూరు బాలికోన్నత పాఠశాల ప్రాంగణంలో దోనేపూడి, కొల్లూరు, అనంతవరం, భట్టిప్రోలు మండలం వెల్లటూరు సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ట్రైనింగ్‌లో చివరి రోజైన శనివారం ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహార పదార్థాలను గర్భిణులు, బాలింతలకు సరైన సమయంలో అందజేయడంతోపాటు, వారు వాటిని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు టి.విజయలక్ష్మి, పజరున్నీస, మాణిక్యం పాల్గొన్నారు.

చిన్నారుల మనోవికాసాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

రేపల్లె రూరల్: చిన్నారుల మనోవికాసాభివృద్ధికి అంగన్‌వాడీలు ప్రత్యేక శ్రద్ధ వహించి, ఆట పాటలతో కూడిన విద్యను అందించాలని సీడీపీఓ ఎం.సుచిత్ర అన్నారు. పట్టణంలోని మున్సిపల్ హైస్కూలు, ట్రిబుల్ ఎస్ హైస్కూలులో రేపల్లె పట్టణ, మండలంలోని అంగన్‌వాడీలకు పోషణ్ భీ పడాయి బీ అంశంపై నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి.

పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సహకారం

మోదుకూరు(వేమూరు): పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సహకారం పూర్తిగా ఉండాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు కోరారు. చుండూరు మండలంలోని మోదుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు కంప్యూటర్లు శనివారం అందజేశారు. పూర్వ విద్యార్థి నాగేశ్వరరావు రూ.50 వేలతో ఐదు కంప్యూటర్లు, మోపర్రు కోటయ్య కోసం రూ.25 వేల అందించారు.



కంప్యూటర్లు అందజేసిన పూర్వ విద్యార్థులు, వెంకటేశ్వర్లు, కోటయ్య

రైతులకు విశిష్ట సంఖ్య తప్పనిసరి

కొల్లిపర: వ్యవసాయ రంగాన్ని పూర్తి ఆధునీకరణ(డిజిటలేషన్) చేసే ప్రక్రియలో భాగంగా కేంద్ర ప్రభుత్వం రైతులకు 14 అంకెలతో విశిష్ట గుర్తింపు సంఖ్య(యూనిక్ ఐడీ) ఆధార్ కార్డు తరహాలో అందించనుందని ఎవో కె.వెంకటరావు అన్నారు. శనివారం మండలంలోని వివిధ రైతు సేవా కేంద్రంలో నమోదు కార్యక్రమం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ భూమి కలిగిన రైతులు ఆధార్, ప్రభుత్వం ఇచ్చిన పాస్‌పుస్తకం, వన్‌బీ, ఆధార్‌తో లింకు కలిగిన ఫోన్ పట్టుకుని దగ్గరలో ఉన్న రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ శాఖ సిబ్బంది కి అందిస్తే వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయటం జరుగుతుందని తెలిపారు.

రహదారిని ఆక్రమించిన చెట్ల తొలగింపు



తెనాలిటౌన్: పట్టణ ఆటోనగర్ నుంచి నందివెలుగు వరకు రోడ్డుకు ఇరువైపులా మార్జినులో చెట్ల తొలగింపుకు ఆర్అండ్‌బీ అధికారులు శ్రీకారం చుట్టారు. శనివారం ఆటోనగర్ నుంచి పొక్లయిన్‌తో పనులను ప్రారంభించారు. ఇటీవల చోటు చేసుకుంటున్న రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని, ఇరువైపులా పెరుగుతూ మార్జిన్లను ఆక్రమించేసిన చెట్లను తొలగిస్తున్నట్టు అధికారులు తెలియజేశారు.

23 కిలోల గంజాయి స్వాధీనం

తెనాలిరూరల్: రైల్లో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని జీఆర్పీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో తెనాలి రైల్వే పోలీసులు శనివారం పూరి-తిరుపతి ఎక్స్‌ప్రెస్ ఏ-1 కోచ్‌లో తనిఖీలు నిర్వహించారు. 4 బ్యాగుల్లో 23 కిలోల గంజాయిని గుర్తించారు.రైల్వే సీఐ శ్రీనివాసరావు, జీఆర్పీ ఎస్ఐ వెంకటాద్రి 3వ నెంబర్ ప్లాట్ ఫామ్ పై రైలులో తనిఖీలు చేశారు. తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణకు సమాచారం ఇచ్చి ఆయన సమక్షంలో గంజాయిని స్వాధీన పరుచుకున్నారు. కాగా గంజాయి తరలిస్తున్న నిందితులు పరారయ్యారు.

భర్త వేధింపులపై కేసు నమోదు

తెనాలిరూరల్: భార్యను వేధింపులకు గురిచేస్తున్న భర్తపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు పట్టణ శాలిపేటకు చెందిన రమేష్ తన భార్య జయశ్రీని కొద్ది కాలంగా వేధింపులకు గురి చేస్తున్నాడు. బాధితురాలు పోలీసులను ఆశ్రయించగా వన్ టౌన్ పోలీసులు కేసు శనివారం నమోదు చేశారు.

ఒకేషనల్ కోర్సులో అసెస్‌మెంట్ పరీక్ష

అమృతలూరు(వేమూరు): పదో తరగతి, సీనియర్ ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ఒకేషనల్ కోర్సులో శిక్షణ ఇచ్చినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కనపర్తి నిరీక్షణరావు తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శనివారం పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు బాపట్ల జిల్లా కోఆర్డినేటర్ సత్యనారాయణ, అసెస్మెంట్ ఎగ్జామినర్ రుబియ సుల్తానా పర్యవేక్షించారు.

అంగన్‌వాడీలకు అవగాహన

తెనాలిటౌన్: దివ్యాంగ పిల్లలకు స్క్రీనింగ్, ఇంక్లూజన్, రిఫరల్స్, ప్రొటోకాల్‌పై అవగాహన కార్యక్రమాన్ని శనివారం స్థానిక కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. పోషణ్‌బీ పడాయిబీ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడురోజులపాటు శిక్షణ తరగతులను నిర్వహించారు. చివరిరోజైన శనివారం ఏర్పాటైన సమావేశంలో డాక్టర్ హనోక్ పాల్గొని దివ్యాంగ పిల్లల విషయంలో అంగన్‌వాడీలు పాటించాల్సిన స్క్రీనిగ్, ఇంక్లూజన్, రిఫరల్స్, ప్రొటోకాల్ అంశాలపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు తెనాలి సీడీపీఓ డాక్టర్ కె.సునీత మాట్లాడుతూ పోషకాహారం లోపం లేని సమాజ నిర్మాణమే ధ్యేయంగా అంగన్‌వాడీలు పనిచేయాలని సూచించారు. 0-6 సంవత్సర వయసులోని పిల్లలకు ఆహారం అందించే విషయంలో తల్లులకు వివరించాల్సిన సూచనలను తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని పోషణ్‌బీ పడాయిబీ కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా అమలు చేసేందుకు ప్రాజెక్టు పరిధిలోని 200 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడురోజులపాటు నాలుగు ప్రదేశాల్లో శిక్షణ తరగతులు జరిపినట్టు చెప్పారు. శిక్షణ తరగతుల్లో సూపర్‌వైజర్లు సీహెచ్ హిమబిందు, నాగమణి, నందుకుమారి, వెంకటలక్ష్మి, పాల్గొన్నారు.

అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం కావాలి

11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి. శ్రీనివాసులు

తెనాలిరూరల్: మార్చి 8న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.శ్రీనివాసులు న్యాయవాదులను కోరారు. తెనాలి కోర్టు సముదాయంలో శనివారం న్యాయవాదులతో ఆయన సమావేశమయ్యారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీపడితే కోర్టు ఫీజులు సైతం వాపసు వస్తాయని, కక్షిదారులకు దీనిపై అవగాహన కల్పించాలని సూచించారు. రాజీ అయ్యే వీలున్న కేసులన్నింటినీ అదాలత్‌లో పరిష్కరించుకునేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా సమయంతో పాటు డబ్బులు ఆదా అవుతాయని స్పష్టం చేశారు. అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చొరవ చూపాలని కోరారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, దాసరి శ్రీధర్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



న్యాయవాదులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాసులు

హోం కంపోస్ట్‌పై అవగాహన కలిగి ఉండండి



బస్టాండ్ ఆవరణను శుభ్రం చేస్తున్న డీఎం రాజశేఖర్, ఉద్యోగులు



మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న

తెనాలిఅర్బన్: హోం కంపోస్ట్‌పై అందరు అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కమిషనర్ బండి శేషన్నలు పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలలు, హాస్పిటల్స్, హోటల్స్‌లో సోర్స్-రిసోర్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో వారు మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలో హోం కంపోస్ట్ విధానాన్ని ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నా మన్నారు. ప్రతి ఒక్కరు మూడు బుట్టల విధానాన్ని పాటించాలని సూచించారు. ప్రతిరోజు కార్మికులకు తడి-పొడి-హానికర చెత్తలుగా విభజించి అందజేయాలన్నారు. అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు, ఆరోగ్యాధికారిణీ డాక్టర్ కె.హెలెన్ నిర్మలలు మాట్లాడుతూ తెనాలిని సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతిరోజు డోర్ టుడోర్ కలెక్షన్‌తో పాటు మురుగు కాల్వలు బాగు చేయటం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో పలువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు, శానిటరీ సెక్రెటరీలు, నగర దీపికలు, ఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

■ తెనాలి ఆర్టీసీ డిపో ఆవరణలో శనివారం స్వచ్ఛంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆవరణను ఊడ్చి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ మాట్లాడుతూ బస్టాండ్ మనది అనే భావన అందిరిలో వస్తే చాలా వరకు పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయని తెలిపారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించడం జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

కొల్లిపర: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలపై అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వారికి పోషక విలువలు పెరిగే విధంగా తగు ఆహారం అందించాలని, ఎప్పటికప్పుడు వారి ఎదుగుదల రికార్డులతో పొందుపరిచి ఎటువంటి అనుమానాలున్నా వెంటనే వైద్యులను సంప్రదించి వారి సలహాలు తీసుకోవాలని కొల్లిపర సీహెచ్‌సీ వైద్యశాల డాక్టర్ జి.గంగాధర్ అన్నారు. స్థానిక హైస్కూల్‌లో పోషణ్ భీ-పడాయి భీ కార్యక్రమంలో భాగంగా 3వ రోజు అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తూములూరు, కొల్లిపర సెక్టార్ సూపర్‌వైజర్లు టి.రాధిక, కె.యామిని కార్యకర్తలకు పిల్లల అభ్యాసం, ముల్యాంకనం, విభిన్న అసెస్‌మెంట్ సాధనాలు, సాంకేతికతలపై, 3 ఏళ్ల లోపు చిన్నారులకు పోషణ సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ గంగాధర్

లోక్‌అదాలత్‌లో అధిక కేసుల పరిష్కారానికి కృషి

సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు

రేపల్లె రూరల్: పెండింగ్ కేసుల పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న లోక్‌అదాలత్‌లో అధిక కేసులు పరిష్కారం అయ్యేలా అధికారులు పనిచేయాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక కోర్టు హాలులో పోలీసు, రెవెన్యూ, బ్యాంక్ తదితర శాఖల అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. మార్చి 8వ తేదీన లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ఆయాశాఖల అధికారులు పనిచేయాలని చెప్పారు. ఈ సమావేశంలో న్యాయవాదులు పీఎస్‌బీ శర్మ, కె.నాగాంజనేయులు, ఎస్‌బీఐ బజార్ బ్రాంచ్ మేనేజర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

బాపట్ల: మండలంలోని ఈస్ట్‌బాపట్ల గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. శనివారం గ్రామ పంచాయతీలో దుస్తులు, కొబ్బరినూనె, చెప్పులను కార్యదర్శి పల్నాటి శ్రీరాములు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకంగా ఉంటుందని తెలిపారు.

బస్సు ఢీకొని ప్లంబర్‌కు తీవ్ర గాయాలు



తెనాలిరూరల్: ఆర్టీసీ బస్సు ఢీకొని ప్లంబర్ తీవ్ర గాయాలపాలైన ఘటన స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో వంతెన వద్ద శనివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల గ్రామం కోపల్లెకు చెందిన ఖగ్గా రవికుమార్ ప్లంబర్ పని చేసుకుని జీవనం సాగిస్తూ ఉంటాడు. మధ్యాహ్నం మోటార్ బైక్ పై వెళుతుండగా చెరుకుపల్లి వైపు నుండి బస్టాండ్‌లో వెళ్తున్న ఆర్టీసీ బస్సు బస్టాండ్ వంతెన వద్ద ఇతని వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రవికుమార్ తీవ్రంగా గాయపడగా స్థానికులు ఆటోలో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరుకు తీసుకువెళ్లారు. వైద్యశాల నుంచి వచ్చే సమాచారం మేరకు కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.